చెత్త కొండ కరిగేనా..

- నివాసాల మధ్య డంపింగ్ యార్డు
- 20 ఏళ్లుగా చెత్త డంపింగ్
- తొలగింపునకు నగరపాలకసంస్థ చర్యలు
- ఆరు నెలల్లో పూర్తయ్యే అవకాశం



డంపింగ్ యార్డులో కొండలా పెరిగిపోయిన చెత్త



చెత్తలోంచి వేరు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

సీటీఆర్ఐ: స్థానిక 45వ డివిజన్‌లోని ప్రధాన డంపింగ్ యార్డులో చెత్త విపరీతంగా పేరుకుపోయింది. ఇది దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా. ఎందుకంటే సుమారు 20 ఏళ్లుగా నగరంలోని చెత్తను ఇక్కడే డంపింగ్ చేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులో చెత్త కొండలా పెరిగిపోయింది. చెత్త కారణంగా సమీపంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డును వేరేచోటుకు తరలించాలని అనేక సార్లు అధికారులను వేడుకున్నారు.

కాలుష్య మండలి ఆదేశాలు

డంపింగ్ యార్డులోని చెత్తను తొలిగించాలని జాతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇక్కడి పేరుకుపోయిన చెత్త నిల్వలను తొలగించేందుకు నగరపాలక సంస్థ సిద్ధమైంది. ఇప్పటికే తడి, పొడి చెత్త విధానం అమలు జరుగుతున్న తరుణంలో అదే తరహాలో ఇక్కడ చెత్తను వేరు చేసే ప్రక్రియను చేపట్టనున్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు ఈ బాధ్యతను అప్పగించనున్నారు. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను తరలించడానికి కనీసం ఆరు నెలలైనా పడుతుందని నగరపాలక సంస్థ అంచనా వేసింది. చెత్త నిల్వల వల్ల ప్రతి ఏటా స్వచ్ఛసర్వేక్షణ్‌లో నగరానికి ఇచ్చే ర్యాంక్ తగ్గిపోతోంది.

రోజుకు 160 మెట్రిక్ టన్నులు

నగరానికి ప్రధాన డంపింగ్ యార్డు కావడంతో చెత్తంతా ఇక్కడే వేస్తున్నారు. రోజుకు సుమారు 160 మెట్రిక్ టన్నుల చెత్తను ఇక్కడకు తీసుకువస్తారు. వాటిలో 40 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు, మిగిలినవి తడి, పొడి చెత్త ఉంటున్నాయి. దాదాపు 20 ఏళ్ల ఇక్కడ చెత్తను నిల్వ చేయడంతో కొండలా పెరిగిపోయింది.

వాంబే గృహాల నిర్మాణం

ఇక్కడే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 2006లో వాంబే గృహాలను నిర్మించారు. ఒక వైపు లూథరన్ గిరిలోని ఇళ్లు, మరో వైపు వాంబే గృహాలతో పాటు ఈ ప్రాంతంలో సచివాలయం కూడా ఉంది. డంపింగ్ యార్డు కారణంగా ఈ సమీపంలోని ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై నగరపాలక సంస్థకు అనేక ఫిర్యాదులు చేశారు. అయితే చెత్తను ఎక్కడకు తరలించాలో తెలియకపోవడంతో డంపింగ్ యార్డులోనే ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయినా పెద్దగా ఫలితం రాలేదు. కాగా.. డంపింగ్ యార్డు కారణంగా సమీపంలో నివసిస్తున్న వారికి ఆరోగ్య సమస్యలు, ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక్కోసారి చెత్తకు నిప్పు అంటుకుని దట్టమైన పొగ వెలువడుతోంది. దీంతో సమీపంలోని ప్రజలందరూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫైర్ ఇంజిన్లతో వీటిని ఆర్పినా రెండు, మూడు రోజుల వరకూ అదుపులోకి రావడం లేదు.

భరించలేని దుర్గంధం



డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నాం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాకు ఇక్కడ వాంబే గృహాలను కట్టించారు. అప్పుడు ఇంత చెత్త ఉండేది కాదు. కానీ ఈ 20 ఏళ్లలో చెత్త కొండలా పెరిగిపోయింది. వెంటనే దాన్ని తరలించాలి.

– ఉమా మహేశ్వరరావు, స్థానికుడు

ఇబ్బంది పడుతున్నాం



చెత్త సమస్యపై ఎన్ని ఫిర్యాదులు చేసినా, ధర్నాలు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇక్కడ చెత్తను డంపింగ్ చేయడం కూడా మానలేదు. ఇక్కడ అందరూ పేద వర్గానికి చెందిన వారే ఉంటున్నారు. చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.

– కె.సూరిబాబు, స్థానికుడు

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

ప్రకాశం నగర్: విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు యు.రామస్వామి డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా చేపట్టిన విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ జాతా బుధవారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం చేరుకుంది. ఈ జాతాకు స్థానిక నాయకులు శ్యామలా సెంటర్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు టి.అరుణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం కేవలం ప్యాకేజీ ప్రకటించి చేతులు దులుపుకోవటం సరైంది కాదని విమర్శించారు. ఉక్కు పరిశ్రమకు ఇనుప గనులను కేటాయించడంతో పాటు, ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకుంటున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నెల్లూరులో జరగబోయే సీపీఎం 27వ రాష్ట్ర మహా సభలలో చర్చించి విశాఖ ఉక్కు పరిరక్షణకు తీర్మానం చేయనున్నామని వెల్లడించారు. రాష్ట్ర నాయకుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరిత విధానాలను అనుసరిస్తోందన్నారు. రాష్ట్ర నాయకుడు బి.గురప్ప మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఉత్పత్తి 20 మిలియన్ల టన్నులకు విస్తరించే అవకాశం ఉందని అన్నారు. సుమారు 50 వేల మందికి ఉపాధి కల్పించే అవకాశాలున్నాయని అటువంటి పరిశ్రమకు సొంత గనులు కేటాయించడంలో పాలకులకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు విశాఖ ఉక్కుపై ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో బి.మహేష్, యు.సోమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు జువ్వల రాంబాబు, టి.తులసి, బి.పవన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీ నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మెయిన్ డ్రైనేజీ పనులను త్వరలో మొదలు పెడతామన్నారు. ఈ మురుగు నీరంతా ధవళేశ్వరానికి చేరుతుందని, అక్కడ పంప్ హౌస్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంటన టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, ఎంపీడీవో డి.శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ, జేఈ సంపత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు. అలాగే కాతేరులోని డీఎస్ నగర్‌లో పేపరు మిల్లు ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే గోరంట్ల పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పేపరు మిల్లు సహకారంతో ముంపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. మాజీ వైస్ ఎంపీపీ గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, గంగిన నాని, కురుకూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



పాఠశాలను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను బుధవారం సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.ప్రకాష్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం మెనూని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు భోజనం అన్నామృత ఫౌండేషన్ ఇస్కాన్ ద్వారా అందుతోందని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూనే సరఫరా చేస్తున్నారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు వివరించారు. అనంతరం పాఠశాలలోని భోజనశాలను ప్రకాష్ బాబు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ టి.వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు బీవీ శారదా దేవి పాల్గొన్నారు.

రోబోటిక్ టెక్నాలజీపై శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శ్రేయా సుధీర్

కంబాలచెరువు: భవిష్యత్తులో అన్ని రంగాలలో కృత్రిమ మేధ విస్తరిస్తుందని సీఎస్ఆర్ ఇండియా మేనేజర్ శ్రేయా సుధీర్ అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం రోబోటిక్ టెక్నాలజీపై శిక్షణ ఇచ్చారు. 8, 9 తరగతులకు చెందిన వందమంది విద్యార్థులు ఈ శిక్షణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు పి.దుర్గాప్రసాద్, డిజిటల్ ఐటీ ఆపరేషన్ ప్రతినిధి మహ్మద్ జానీ, ష్లమ్‌బెర్గర్ కాకినాడ బేస్ మేనేజర్ రాజ్యలక్ష్మి, అడ్మిన్ వీరనాచర్ల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకులలో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న లక్ష్మీపతిరావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: బ్యాంకులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా బ్యాంకు ఉద్యోగులు కో ఆర్డినేషన్ కమిటీ సెక్రటరీ ఎస్.లక్ష్మీపతిరావు డిమాండ్ చేశారు. యూనియన్ బ్యాంకు ప్రకాశం నగర్ శాఖలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఖాతాదారులకు ఇబ్బంది లేకుండా క్లరికల్ నియామకాలు వెంటనే జరపాలన్నారు. ప్రభుత్వ బ్యాంకులను పటిష్ట పరిచి, ఖాతాదారులకు సర్వీస్ చార్జీలు తగ్గించాలన్నారు. బ్యాంకులు ప్రైవేటుపరం కాకుండా ఆపాలని, ఐదు రోజుల పనిదినాలను అమలు పర్చాలన్నారు. ఈ డిమాండ్లతో త్వరలో ఆందోళనలు, సమ్మె చేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. సమావేశంలో స్వాతి, ఉమారాణి, శ్రీనివాస్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో గుంతలు లేకుండా రహదారుల మరమ్మతులు చేపట్టాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ స్పష్టం చేశారు. గోకవరం బస్టాండ్ నుంచి కోరుకొండ రోడ్డు, శానిటోరియం వరకూ గల రహదారిని బుధవారం ఆయన ఆర్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో నగరంలోని రహదారుల స్థితిని పరిశీలించినట్టు తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ముస్సోరిలో శిక్షణ కోసం వెళ్లారన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ స్టోర్ విభాగాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఎంసీ మెడికల్ ఆఫీసర్ వి.వినూత్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సల్ఫయిడ్ ఇంజురీతో మొక్కల్లో ఎదుగుదల లోపం



కడియం ఆవలో రైతులకు సూచనలు చేస్తున్న ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ నరసింహారావు

కడియం: మండలంలోని ఆవ ప్రాంతంలో సాగు చేసిన రబీ వరిలో సల్ఫయిడ్ ఇంజురీ (సల్ఫయిడ్ దుష్ప్రభావం)తో మొక్కల ఎదుగుదల లోపించిందని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. దాని నివారణకు చేపట్టాల్సిన నీటి, ఎరువుల యాజమాన్యంపై రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన బుధవారం ఆవ ప్రాంతంలో వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా వరి ఎదుగుదలలో లోపాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎలుకల మందు పొట్లాలను పంపిణీ చేశారు. ఈ క్షేత్ర సందర్శనలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, కడియం ఏఓ ద్వారకాదేవి, ఉద్యానవన అధికారి సుధీర్ కుమార్, వీఏఏ శంకర్, దుర్గబాబు, అభ్యుదయ రైతులు సత్తిరాజు, మారిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సల్ఫయిడ్ ఇంజురీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలు ఇవే..

- మురుగు నీరు సౌకర్యం లేని పొలాలు, సల్ఫర్ కలిగిన ఎరువులు, 20:20:0:13 కాంప్లెక్స్ ఎరువు వాడిన పొలాల్లో సల్ఫయిడ్ ఇంజురీ కనిపిస్తుంది.
- దీనివల్ల వేరు, ఆపైన కొంత కాండం భాగం నల్లగా మారుతుంది. పొలంలో నడుస్తుంటే, బుడగలు వస్తుంటాయి. వేరు భాగం వద్ద సల్ఫరు చెడు వాసన వస్తుందన్నారు.
- దీని నివారణకు రైతులు తమ వరిచేలో నీటిని అడపాదడపా ఆరబెట్టాలి. మళ్లీ స్వచ్ఛమైన నీటిని పెట్టాలి. గంధకం కలిగిన కాంప్లెక్స్ ఎరువులను వాడకూడదు. నీటిని పూర్తిగా తీసివేసి, తదుపరి బురద పదునులో ఎకరాకు 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ వేసి, 12 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలన్నారు. దాళ్వా వరి తరువాత పచ్చిరొట్ట పంటలైన జీలుగ విత్తనాలు చల్లి, పంట వచ్చాక భూమిలో కలియదున్నాలి.
- వరిలో కాండం కుళ్లు తెగులు నివారణకు టెబ్యూకోనాజోలు 2 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో బుధవారం కోర్టు ప్రాంగణంలో ఆమె సమావేశం నిర్వహించారు. మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎక్కువ కేసులు పరిష్కరించుకునేందుకు ఈ జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు పెండింగ్‌లో రాజీ పడదగిన అన్ని ఇతర కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానం సరికాదు



మార్టిన్ లూథర్

రాజమహేంద్రవరం సిటీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సూచించిన వ్యక్తులను కాదని, సమాజంలో కులాల మధ్య చిచ్చుపెట్టే వ్యక్తులకు పద్మశ్రీ అవార్డులు ఇవ్వటం బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనమని పీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ స్టేట్ అబ్జర్వర్ మార్టిన్ లూథర్ విమర్శించారు. ఆయన బుధవారం రాజమహేంద్రవరంలో మాట్లాడుతూ అవార్డుకు గల అర్హతలను తుంగలోకి తొక్కారన్నారు. కులం, మతం, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే సమూహాలు, దానికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తులకు పద్మశ్రీ అవార్డులు ఇచ్చిన సందర్భం దేశ చరిత్రలో ఇంతకు ముందెప్పుడూ లేదన్నారు. కాంగ్రెస్ విలువలతో కూడిన రాజకీయం చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల కోసం తప్పుడు రాజకీయాలు చేస్తూ, రాజ్యాంగ విలువలకు వక్రభాష్యం చెబుతోందన్నారు. ఎస్సీలందరూ ఐక్యంగా ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటోందని స్పష్టం చేశారు.

ఆరోగ్య పరీక్షా శిబిరం



ఆరోగ్య పరీక్షా శిబిరం వద్ద జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రాజమహేంద్రవరం రూరల్ శాఖ ఆధ్వర్యంలో డెల్టా హాస్పిటల్స్ సౌజన్యంతో బుధవారం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాకర్స్‌కు ఇన్సూరెన్స్, పెన్షన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ సాహు, సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, రూరల్ బ్రాంచ్ మేనేజర్ సూర్యనారాయణ, ఏబీఎం అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టు సాధిస్తే మంచి ఉద్యోగాలు



సెమినార్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ రాఘవకుమారి తదితరులు

సీటీఆర్ఐ: హిందీ భాషపై పట్టు సాధిస్తే మంచి ఉద్యోగావకాశాలు పొందవచ్చని డాక్టర్ సుకన్య మేరీ జోసెఫ్ అన్నారు. హిందీ భాష – సాహిత్యం – ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై బుధవారం కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు జాతీయ సదస్సు జరిగింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దీన్ని నిర్వహించారు. కర్ణాటకకు చెందిన డాక్టర్ సుకన్య మేరీ జోసెఫ్, పూర్ణా ప్రజ్ఞ, మహారాష్ట్రకు చెందిన డాక్టర్ యశ్వంత్కర్ సంతోష్ కుమార్ లక్ష్మణ్ తదితరులు ఆన్‌లైన్‌లో హాజరై, విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి తొలి పలుకులతో సెమినార్ ప్రారంభమైంది. మేరీ జోసెఫ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో హిందీ ఉద్యోగాలతో పాటుగా పత్రికలు, టీవీ, సినిమా, సోషల్ మీడియా, అంతర్జాతీయ స్థాయిలో అనువాదకులుగా అవకాశాలు ఉన్నాయన్నారు. సంతోష్ కుమార్ లక్ష్మణ్ మాట్లాడుతూ హిందీలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే స్కిల్స్‌పై పట్టు సాధించాలన్నారు. హిందీ సాహిత్యంలో ఎంఏతో పాటుగా ట్రాన్స్‌లేషన్ డిప్లమో, జర్నలిజంలో శిక్షణ తీసుకుంటే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో వందమంది, ఆఫ్‌లైన్‌లో 120 మంది హాజరయ్యారు. హిందీ లెక్చరర్ డాక్టర్ కె.నీరజ వందన సమర్పణతో సెమినార్ ముగిసింది.

150 గ్రాముల బంగారు వస్తువుల చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంట్లోని 150 గ్రాముల బంగారు వస్తువులను దొంగలు మాయం చేశారు. వివరాల్లోకి వెళితే.. దివాన్ చెరువు డీబీవీ రాజు విల్లాస్ హౌస్ నెంబరు 80లో బండారు రాంబాబు కుటుంబం అద్దెకు ఉంటుంది. ఆయనకు కర్ణాటకలోని మాన్వి గ్రామంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ నెల 16వ తేదీన వ్యవసాయ పనుల నిమిత్తం ఆ కుటుంబం కర్ణాటక వెళ్లింది. మంగళవారం విల్లాస్‌లో ఉండే ఒక వ్యక్తి రాంబాబు విల్లాకు సంబంధించిన తలుపులు తీసి ఉండడంతో అతనికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో బుధవారం కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి బీరువాలోని 150 గ్రాముల విలువైన బంగారపు వస్తువులు కనిపించలేదు. వాటి విలువ రూ.4.50 లక్షలు ఉంటుందని రాంబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. సంఘటనా స్థలాన్ని తూర్పుజోన్ డీఎస్పీ బి.విద్య, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: భార్యతో గొడవపడిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శాటిలైట్ సిటీ రాజీవ్ గృహకల్పలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శాటిలైట్ సిటీ రాజీవ్ గృహకల్ప అపార్టుమెంట్‌లో రేగిశెట్టి పైడిరాజు (28) కూలి పని చేస్తుంటాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.. బుధవారం మధ్యాహ్నం మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడి ఇంటిలోకి వెళ్లి తలుపు వేసుకుని పడుకున్నాడు. రాత్రి 6.30 గంటల సమయంలో భార్య తలుపు కొట్టి పైడిరాజును లేపుదామని పిలుస్తుంటే ఎంతటికి పలకపోవడంతో కిటికీలో నుంచి చూసింది. అప్పటికే పైడిరాజు శ్లాబ్ కొక్కానికి చీరతో ఉరి వేసుకుని ఉన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ఆవ భూముల్లో అక్రమ దందా

- ప్రభుత్వ భూములపై కూటమి నాయకుల అజమాయిషీ
- వాటిని కౌలుకు ఇచ్చి శిస్తు వసూలు
- దర్జాగా అక్రమార్జన
- రాజకీయ నాయకుల అండదండలు



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూశాఖ అధికారులు



కాపవరంలో అక్రమంగా సాగు చేసిన మొక్కజొన్నను ధ్వంసం చేయిస్తున్న వీఆర్వో

మధురపూడి: ఆవ భూముల ద్వారా అక్రమార్జనకు కూటమి నాయకులు తెరలేపారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములను రైతులకు కౌలుకు ఇచ్చి, వారి నుంచి శిస్తును వసూలు చేస్తున్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి సమీపంలోని ఆవ భూముల్లో ఈ దందా కొనసాగుతోంది. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బూరుగుపూడి సమీపంలోని 586 ఎకరాలను కొనుగోలు చేసింది. ఆ భూముల యజమానులైన రైతులందరికీ నగదు కూడా అందజేసింది. అయితే అప్పటి ప్రతిపక్ష నాయకులు ఈ భూములపై పెద్ద వివాదం లేపారు. అవి నివాసానికి ఏమాత్రం ఆమోద యోగ్యం కాదన్నారు. అనంతరం కోర్టుకు వెళ్లి ఆ భూములను పేదలకు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారు.

ఆదాయ వనరు

ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో కూటమిలోని అప్పటి ప్రతిపక్ష నాయకులు కొత్త దందాకు తెర తీశారు. అప్పట్లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ఆవ భూములపై అజమాయిషీ చేయడం మొదలు పెట్టారు. వాటిలో రబీలో ఆరుతడి పంటలను పండించేందుకు అవకాశం ఉండటాన్ని తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పంటలు పండించుకునేందుకు వాటిని కొందరు రైతులకు కౌలుకు ఇచ్చారు. వారి నుంచి భారీగా శిస్తు వసూలు చేస్తున్నారు.

పథకాలు నిల్ – వ్యాపారం ఫుల్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం అనే మాటను మర్చిపోయింది. వారికి పథకాలు అందజేయడం మానేసింది. సేవలను మొత్తం నిలుపుదల చేసింది. ఆ కూటమి నాయకులు మాత్రం కాసుల వేటలో పడ్డారు. మద్యం, ఇసుక, ఆవ భూములు.. ఇలా వేటినీ వదలడం లేదు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆవ భూముల్లో కూటమి నాయకుల అక్రమ దందాపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం బయటకు వచ్చింది. కలెక్టర్ ఆదేశాలపై మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆవ భూముల్లో అక్రమంగా సాగుచేస్తున్న 30 ఎకరాల్లో 6.80 ఎకరాల విస్తీర్ణంలో పంటను ధ్వంసం చేయించారు. తహసీల్దార్ సుస్వాగతం ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమం చేపట్టారు. 80 సెంట్లలోని బీరకాయ తోట, ఆరు ఎకరాల విస్తీర్ణంలోని మొక్కజొన్న, టమాటా పంటను నాశనం చేశారు. మిగిలిన పంట అలాగే ఉంది. అయితే రెవెన్యూ అధికారులపై ప్రభుత్వంలో కొందరు వ్యక్తులు ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం

బకాయి ఎగ్గొట్టేందుకు మహిళపై హత్యాయత్నం

కంబాలచెరువు: తనకు అప్పు ఇచ్చిన మహిళ తరచూ తీర్చమని ఒత్తిడి చేస్తుండడంతో ఆమెను చంపేయాలని అప్పు తీసుకున్న మహిళ నిశ్చయించుకుంది. అందుకు పథకం ప్రకారం హత్యాయత్నం చేసి పరారైంది. కాగా బాధితురాలు బతకడంతో విషయం వెలుగులోకి వచ్చింది. స్థానిక తుమ్మలావలో జరిగిన ఘటన వివరాలను బుధవారం మూడో పట్టణ పోలీసులు తెలిపారు. తుమ్మలావకు చెందిన పసగడుగుల పోసమ్మ, ఆమె కుటుంబం వస్త్ర దుకాణంలో పనిచేస్తుంటారు. పోసమ్మకు అదే ప్రాంతానికి చెందిన సత్యవతితో పరిచయం ఉంది. ఆ స్నేహాన్ని అడ్డుపెట్టుకుని సత్యవతి పోసమ్మ నుంచి కొద్దికాలం క్రితం రూ.30 వేలు అప్పుతీసుకుంది. రోజులు గడుస్తున్నా ఆమె చెల్లించడం లేదు. తన బకాయిని తీర్చమని నిలదీసింది. దీంతో సత్యవతి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లినా బకాయి కోసం పోసమ్మ ఒత్తిడి చేస్తుండడంతో ఆమెను ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని సత్యవతి భావించింది. ఇదిలా ఉండగా హైదరాబాద్ నుంచి వచ్చిన సత్యవతి తుమ్మలావలోని పోసమ్మ వద్దకు వెళ్లింది. నీ డబ్బులు ఇచ్చేందుకే వచ్చామని, నా భర్త డబ్బులు తీసుకువస్తున్నాడని చెప్పింది. పోసమ్మ ఒంటిపై ఉన్న బంగారాన్ని దొంగిలించి ఆమె అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. అదను చూసి కొంత సమయం తర్వాత పోసమ్మ మెడ నులిపి ఆమెను హత్యచేసేందుకు ప్రయత్నించింది. పోసమ్మ చనిపోయిందనుకుని భావించిన సత్యవతి ఆమె మెడలోని బంగారు వస్తువులు తీసుకుని పరారైంది. కొంతసేపటికి ఆమె ఇంటికి వచ్చిన స్థానికులు జీవచ్ఛవంలా పడి ఉన్న పోసమ్మను చూసి ఆసుపత్రికి తరలించారు. ఆమెకు వైద్యులు చికిత్సనందిస్తున్నారు. సత్యవతి కోసం పోలీసులు గాలిస్తున్నారు.